కథ

# భాషాసౌందర్యం

డా॥ కె.పద్మలత

వాకిట్లో కారు హారన్ వినిపించి సుశీల గుమ్మంలోకి వచ్చి చూసింది. పక్కింటి ముందు కారు ఆగి ఉంది. సుబ్బారావుగారు, ఆయన భార్య ఇందిర, మేనల్లుడు శేఖర్ బయట కొచ్చారు. "వెళ్ళొస్తానత్తయ్యా, వస్తాను మామయ్యా" అంటూ చేయి ఊపి కార్లో కూర్చుని వెళ్ళిపోయాడు శేఖర్.

శేఖర్ ఇందిరకు అన్నయ్య కొడుకు. రాజమండ్రిలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. మంచి స్ఫురద్రూపి. "ఒడ్డూ, పొడుగుతో అబ్బాయి చక్కగున్నడు. మా మంజుల కూతుర్ని చేసుకుంటే మంచిగుండు" అనుకుంది సుశీల తన చెల్లెలు కూతురు గురించి ఆలోచిస్తూ. మనసులోకి ఆ ఆలోచన రాగానే త్వరగా వెళ్ళి ఇందిరను ఆ విషయం గురించి అడిగితే బాగుండుననుకుంది.

ఆమె చెల్లెలు కూడా కూతురుకొక మంచి సంబంధం చూడమని పోరుతుంది. చెల్లెలు వాళ్ళు పల్లెటూర్లో ఉండడం వల్ల ఆమె కూతురు శ్రావణి చిన్నప్పటి నుండి సుశీల దగ్గరే ఉండి చదువుకుంది. అందుకని ఆ పిల్ల పెళ్ళి బాధ్యత తన మీద కూడా కొంత ఉందని సుశీల అనుకుంటుంది.

ఆ రోజు మధ్యాహ్నం భోజనాలు కాగానే పక్కింటికి వెళ్ళింది సుశీల. "రండి, కూర్చోండి" అంటూ సోఫాలో నుండి లేవకుండానే ఆహ్వానించింది ఇందిర.

"భోజనాలయినయా?" అంటూ వెళ్ళి కూర్చుంది సుశీల.



"ఆఁ అయిపోయినాయి. ఏంటి విశేషాలు, ఈమధ్య మా ఇంటికసలే రావడంలేదు" నవ్వుతూ అడిగింది ఇందిర.

"వీలుగాలేదుగని, మీరేం అనుకోకపోతే మీతోని ఒకవిషయం మాట్లాడుదామని వచ్చిన" అంది సుశీల.

"చెప్పండి" ఆశ్చర్యంగా అంది ఇందిర.

"మా చెల్లె బిడ్డ శ్రావణిని చూసింన్రుగద. ఎం.సి.ఎ. జేసింది. ఇంట్ల చిన్నచిన్న పనులుగూడ చేస్తది. బుద్ధిమంతురాలు" అన్నది సుశీల.

"అవును. ఆ విషయం నాకు తెలుసు. అయితే ఏంటి? అనుమానంగా చూస్తూ అడిగింది ఇందిర.

"మీ అన్నయ్య కొడుకు వచ్చిపోయిండు గద. చూసిన. అబ్బాయి మంచిగున్నడు. మా శ్రావణిని పెళ్ళి జేసుకుంటే ఎట్లుంటదని అడుగుదామని వచ్చిన" అంది సుశీల. అప్పటివరకు నవ్వుతూ మాట్లాడిన ఇందిర ముఖంలో ఒక్కసారిగా రంగులు మారిపోయాయి.

"అదెట్లా వీలుపడుతుంది. అస్సలు కుదరదు" కొంచెం కటువుగా అంది ఇందిర.

"అదేంది అట్లన్నరు. మేనరికమేమన్న ఉన్నదా"

"మేనరికం లేదుగాని, మా అన్నయ్యకు ఈ ప్రాంతమన్నా, భాష అన్నా అస్సలు పడదు. 'వాళ్ళ భాషనెట్లా అర్థం చేసుకుంటున్నావే, నాకైతే ఒక్కముక్క గూడా అర్థం కావట్లేదు' అన్నాడు పోయినసారి వచ్చినప్పుడు. అట్లాంటిది ఈ ప్రాంతపు అమ్మాయిని వాడి కొడుక్కి చేసుకోవడానికి ఎలా ఒప్పుకుంటాడు" చికాగ్గా అంధి ఇందిర.

"అదేంది, భాష తేడావుంటే ఏమయితది. అయినా, మేం మాట్లాడేది కూడా తెలుగే గద, అర్థం గాకపోవడమేమున్నది" ఆశ్చర్యంగా అడిగింది సుశీల.

"తెలుగే అయినా, మావైపు మాట్లాడినంత స్పష్టంగా, యాసలేకుండా ఇక్కడి వాళ్ళు మాట్లాడలేరు. అంతెందుకు, పది సంవత్సరాల నుండి ఇక్కడే ఉండి, ఇల్లు కూడా కట్టుకొని సెటిల్ అయిపోయినాం కదా. అయినా ఇప్పటికీ ఇక్కడి వాళ్ళు కొందరు మాట్లాడేది నాకర్థం కాదు. అయినా మా భాష, సంప్రదాయం, సంస్కారం వేరు. అవి ఇక్కడి వాళ్ళలో అంతగా కనిపించవు. అంతా వింతగా ఉంటుంది" అని ఈసడింపుగా అని "ఇలా అంటున్నందుకు మీరేమీ అనుకోకండి, సందర్భం వచ్చింది గనుక చెప్పాల్సి వచ్చింది" అంది.

సుశీల బిత్తరపోయింది ఆమె మాటలకు. తలంతా దిమ్ముగా అనిపించింది. ఏం మాట్లాడాలో అర్థంకాక "నేను పోవాలె, ఆయనొచ్చే వేళ యింది" అంటూ దిగ్గున లేచి ఇంటికొచ్చేసింది. ఇంటికొచ్చినా ఇందిర మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి.

"అంటే ఆమె ఉద్దేశం ఏంది. మా భాష మంచిదిగాదు, మాకు సంస్కారం లేదనా? ఎంత ధైర్యం అట్లా మాట్లాడటానికి" అనుకుంది. సాయంత్రం వరకు అన్యమనస్కంగానే గడిపింది. సాయంత్రం "లాభంలేదు. కళ్యాణి దగ్గరకు బోతెగని మనసు కుదుటబడదు" అనుకుంటూ లేచి వంటింట్లోకి వెళ్ళి ఒక టిఫిన్ బాక్సు తీసుకొని బయలుదేరింది.

కళ్యాణి సుశీలకు అన్న కూతురు. గవర్నమెంట్ స్కూల్‌లో తెలుగు టీచర్‌గా పనిచేస్తోంది. మంచితెలివైనది. సంస్కారం ఉన్న మనిషి. సుశీలను చూడగానే కళ్యాణి "రా అత్తా! ఏంది దారి తప్పి వచ్చినవు. అంత మంచిదేనా" అని అడిగింది.

"అంత మంచిదే. ఇంట్ల ఎవ్వరు గనిపిస్తలేరేంది" అన్నది కూర్చుంటూ.

"ఆయన చిన్నోడిని తీస్కొని చౌరస్తాకు బోయిండు.

"పెద్దోడిప్పుడే ట్యూషన్‌కని పోయిండు" అని ఆమె ముఖం చూసి "ఏంది ఒంట్ల బాగలేదా. మొహం వాడిపోయింది" అన్నది.

సుశీల ఒక్క నిమిషం మాట్లాడలేదు. తర్వాత "ముందర ఈ టిఫిన్ డబ్బా లోపల బెట్టిరా. పొద్దున తప్పాలపిండి జేసిన. నీకిష్టమని కొంచెం దెచ్చిన" అన్నది.

"అబ్బ, థాంక్స్ అత్తా! నువ్వు జేసినట్టు తప్పాలపిండి ఎవ్వరు జెయ్యరు" అని టిఫిన్‌బాక్స్ లోపల పెట్టి వచ్చింది.

"ఆఁ. ఇప్పుడు జెప్పు. ఏమయింది. ఎందుకట్లున్నవు" ఆప్యాయంగా అడిగింది కళ్యాణి.

"ఆరోగ్యం మంచిగనే ఉందిగని మనసే బాగలేదే. అందుకే నీదగ్గర కొచ్చిన. నీతోని మాట్లాడితే కొంచెం ఉప్పస దొరుకుతదని" మెల్లిగా అంది సుశీల.

"అదేంది, మామ నిన్ను పువ్వుల్ల బెట్టి చూసుకుంటడు. నీకేం సమస్య" నవ్వుతూ అడిగింది.

"నవ్వకే, నేను జెప్పేది విను ముందర" విసుగ్గా అంది సుశీల.

అదేదో సీరియస్ ఇష్యూనే అనుకుని "సారీ అత్తా! చెప్పు, ఏం జరిగింది" అన్నది.

సుశీల మధ్యాహ్నం తాను ఇందిర వాళ్ళింటికి వెళ్ళడం, శ్రావణి పెళ్ళి గురించి మాట్లాడడం, ఇందిర అన్న మాటలు అన్నీ వివరంగా చెప్పింది. "మన భాష గురించి, సంస్కారంగురించి చిన్నతనంగా మాట్లాడిందే. అందుకే నాకు బాధనిపిస్తుంది" అన్నది.

కళ్యాణి ముఖంఎర్రగా కందిపోయింది- "అట్ల మాట్లాడిందా, ఎంత ధైర్యం ఆమెకు. అయినా ఆమె అన్ని మాటలంటే నువ్వెట్ల వూరుకున్నవు. ఘాటుగ జవాబు జెప్పకపోయినవు" అంది.

"ఏమోనే, పక్కపక్క ఇండ్లాయె. కొట్లాట బెట్టుకుంటె ఏమొస్తది. అందుకే మాట్లాడకుండ బయటికొచ్చిన. అయినా, నా సంసారంల ఏం లోపం గనిపించిందే అట్లమాట్లాడింది" అన్నది.

"అత్తా! ఎవరి భాష, ప్రాంతం, సంస్కృతి వాళ్ళకు గొప్పవే. ఎదుటోళ్ళను ఇన్సల్ట్‌జేసేటట్లుగ మాట్లాడుతోనే ఆమె సంస్కారం ఎంత గొప్పదో అర్థమౌతుంది" అంది. మళ్ళీ కళ్యాణే "మనం మన ప్రాంతపు మాండలికంలో మాట్లాడుతం. దాంట్ల ఉండే తియ్యదనం మనకు దెలుస్తదిగని వాళ్ళకేం అర్థమయితది. వాళ్ళ భాషనే వాళ్ళకు గొప్పగా అనిపిస్తది. ఎవరి ప్రత్యేకత వాళ్ళది" అంది.

"అదిగాదే, భాషల కొంచెం యాస ఉంటే ఏమయితది. పుస్తకాలల్ల రాసినట్టు మాట్లాడాలంటే ఎట్ల గుదురుతది" అంది సుశీల.

"అత్తా! పుస్తకాలల్ల వాడే గ్రాంధిక భాషను మనం నిజజీవితంల వాడే అవసరం లేదు. అట్ల మాట్లాడితే అసహజంగ అనిపిస్తది గూడా. మనం మాట్లాడే భాష మంచిదే. అదిగాక ఇప్పుడు మనదగ్గర పెద్దపెద్దవాళ్ళు, కవులు, మేధావులు అందరు ప్రాంతీయ మాండలికాన్నే వాడాలంటున్నారు" అని "కాళోజి నారాయణరావుగారి గురించి విన్నవా. మనూరే. ఆయనకు 'పద్మవిభూషణ్' బిరుదు గూడ వచ్చింది. గొప్ప కవి, సంస్కర్త" అంది.

"మన వరంగల్‌ల ఆయన గురించి తెలువందెవరికే, నేను గూడ ఆయన గురించి విన్న. చూసినగూడా" సుశీల అన్నది.

"నువ్వు పుస్తకాలు బాగనే చదువుతవ్‌గద. ఆయన 'నాగొడవ' అనే పుస్తకం రాసిండు, చదివినవా" అంది కళ్యాణి.

"పుస్తకాలు చదువుతగని, కథలు, నవలలు జదువుతనే. కవిత్వం నాకర్థంగాదు. అది మీ అటువంటి చదువుకున్నోళ్ళకు అర్థమైతది"

"అత్తా! దాంట్ల కవిత్వమేమిలేదు. అయినా, కాళోజీగారి దగ్గరున్న గొప్పతనమదే. ఆయన కవిత్వం గూడ అందరికి అర్థమయ్యేటట్లే ఉంటది, వాడుక భాషల కవిత్వాన్ని ఎవ్వరికైనా అర్థమయ్యేటట్లు రాస్తడాయన. ఈమధ్య తెలుగు మాండలికాన్ని గురించి ఆయన చెప్పిన మాటలు పేపర్ల చదివిన. ఆయన ఏమంటడో తెలుసా. 'ఏ మాండలికానికైనా తగిన గుర్తింపు లభించాలె, అందరు దాన్ని గౌరవించాలె' అన్నడు. ఇంకా, 'పుస్తకాలల్ల వాడే భాష నిజమైన భాష కాదని, అందరి నోళ్ళల్ల నాని, వాడుకలకు వచ్చే భాషనే నిజమైన భాష' అన్నడు. ఇంకా ఒక



మంచి మాటన్నడు తెలుసా. 'సహృదయత ఉన్నోళ్ళు ఏ మాండలికాన్నైనా అర్థం జేసుకుంటరని, అది లేకపోతే మనిషి పైకెదగడం కష్టం' అన్నడు. ఎంత గొప్పగ చెప్పిండాయన. అంత గొప్పోళ్ళే ఎవరి భాషను వాళ్ళు గౌరవించాలనే చెప్తే మనమెందుకు సిగ్గుపడాలె మన భాష గురించి" అని "అత్తా! వింటున్నవా" అంది.

'వింటున్ననే, నువ్వు మాట్లాడింది వింటె మంచిగనిపిస్తుందే' అన్నది సుశీల.

"అత్తా! మన భాష గురించి, సంస్కృతి గురించి ఎవరో ఏదో అన్నరని నువ్వు బాధపడడం, మనను మనం తక్కువ జేసుకోవడం బంద్ జేయాలె. ఆమె తన ప్రాంతం గురించి, భాష గురించి ఎంత గర్వంగ జెప్పిందో నువ్వు గూడ నీ భాష గురించి, ప్రాంతం గురించి అట్లే జెప్పాలెగని ఎందుకు నారాజ్‌గ ఉండాలె" కళ్యాణి అంది.

> "మా అన్నయ్యకు ఈ ప్రాంతమన్నా, భాష అన్నా అస్సలు పడదు. 'వాళ్ళ భాషనెట్లా అర్థం చేసుకుంటున్నావే, నాకైతే ఒక్కముక్క గూడా అర్థం కావట్లేదు' అన్నాడు పోయిన సారి వచ్చినప్పుడు. అట్లాంటిది ఈ ప్రాంత పు అమ్మాయిని వాడి కొడుక్కి చేసుకోవడానికి ఎలా ఒప్పుకుంటాడు"

"సంస్కారంలేదంటే ఎంత బాధయితదే. నేను గూడ టెన్త్‌క్లాస్ దాక చదువుకున్న. ఎవరితోని ఎట్ల ఉండాలె నాకు గూడ కొంచెందెల్సు" ఉక్రోషంగా అంది సుశీల. కళ్యాణి నవ్వింది "నీ సంస్కారికేమయిందత్తా! నువ్వు అన్నపూర్ణటువంటి చల్లని తల్లివి. ఇంటి దగ్గరకొచ్చి ఎవరన్నడుగుతె లేదనకుండ అన్నం బెడుతవు. అందరితోని కలుపుగోలుగ మంచిగుంటవు. ఎవర్నీ బాధపెట్టవు. ఇంతకన్నా గొప్ప సంస్కారమేముంటది" అని, "అయినా అత్తా! శ్రావణి పెళ్ళి గురించి నువ్వెందుకు రంది పడుతవు. అది చదువుకున్నది, తెలివైంది. మన దగ్గరనే ఏదో ఒక మంచి సంబంధం దొరుకుతది. నీ కొడుకు గూడ ఏవో ఒకటి రెండు మంచిసంబంధాలున్నయిచెప్తా" అన్నడు. నువ్వేం ఫికర్ పడక మంచిగుండు" అంది.

"నీ కడుపు చల్లగుండ. మంచిగ మాట్లాడినవే. నీతోటి మాట్లాడితే నాకు ఉప్పసదొరికి ధైర్యం వచ్చిందే" అని "చీకటయింది ఇగబోత" అని లేచింది. కళ్యాణితోని బొట్టుపెట్టించుకొని ఇంటికొచ్చింది.

ఆ తర్వాత మూడురోజులకు ఒక సంఘటన జరిగింది. ఆరోజు కళ్యాణి స్కూల్‌కి వెళ్ళకుండా ఇంట్లోనే ఉండిపోయింది. "ఎప్పటినుండో భద్రకాళి గుడికి పోదామనుకుంటే వీలుకావట్లేదు. ఇవాళ సాయంత్రం వెళ్ళాలి" అనుకుంది.



సాయంత్రం చిన్నకొడుకు ధీరజ్‌ని తీసుకొని గుడికి వెళ్ళింది. అమ్మవారి దర్శనం చేసుకొని బయటికొచ్చి చెరువు వైపు చూస్తూ నిలుచున్నారు. ఇంతలో ధీరజ్ నెవరో పిలవడంతో "అమ్మా! నువ్విక్కడే ఉండు.

నేను మా ఫ్రెండ్‌తో మాట్లాడి వస్తాను" అని ధీరజ్ వెళ్ళిపోయాడు. సరే చేసేదేముంది ఇక్కడే బెంచిపై కూర్చుందామని దగ్గర్లో ఉన్న సిమెంట్ బెంచి వైపు కదిలింది కళ్యాణి. అక్కడ సుశీల వాళ్ళ పక్కింటావిడతో కూర్చొని కనిపించింది. "వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టనిపించింది" కళ్యాణికి. గబగబా ఆవిడ దగ్గరకు వెళ్ళి "నమస్తే ఇందిరగారు బాగున్నారా" అని పలకరించింది. ఆవిడ ఉలిక్కిపడి చూసి "ఆc ఆc బాగానే ఉన్నాను. ఇంతకీ మీరు" అని సందేహంగా చూసింది.

"మీ పక్కింట్లో ఉండే సుశీల నాకు అత్తయ్య అవుతుందండి. నేను మిమ్మల్ని వాళ్ళింట్లో ఒకటి, రెండుసార్లు చూశాను" అంది ఆమె పక్కన కూర్చుంటూ.

"ఔను. నేను కూడా ఎక్కడ చూశానా అని ఆలోచిస్తున్నాను"

"మీ గురించి మా అత్తయ్య అప్పుడప్పుడు చెప్తుంది లెండి. మొన్న కూడా ఓ రోజు మీ ఇంటికొచ్చిందటకదా" అడిగింది కళ్యాణి.

"ఔనండి. ఏదో పెళ్ళి సంబంధం గురించి మాట్లాడటానికి వచ్చారు. నేను వీలుపడదని చెప్పాను. పాపం డిసప్పాయింట్ అయ్యారో ఏమో" అంది ఇందిర.

"దాందేముందిలెండి. పెళ్ళి విషయంలో ఎవరి అభిప్రాయాలు వారికుంటాయి. మీ అభిప్రాయం మీరు చెప్పారు. తప్పేముంది"

"బాగా చెప్పారు. నేను అందుకే నిక్కచ్చిగా వీలుపడదని చెప్పాను" కళ్యాణి వైపు మెచ్చుకోలుగా చూస్తూ అంది ఇందిర.

"ఆ విషయం వరకు ఫరవాలేదండి. మీ అభిప్రాయం మీరు చెప్పారు. బాగానే ఉంది. కాని, చేసుకోవడానికి మీరు చూపించిన కారణమే బాగాలేదు" కళ్యాణి అంది.

"అదేంటి?" ఆశ్చర్యంగా చూసింది ఇందిర.

"క్షమించండి. నేను కొంచెం సూటిగానే మాట్లాడాలనుకుంటున్నాను. తెలంగాణ ప్రాంతపు ప్రజల గురించి, భాష గురించి మీరు చెప్పిన అభిప్రాయాలు కరెక్టుగా లేవు. ఒకరకంగా మా అత్తయ్యను మీ మాటలు బాగా హర్ట్ చేసాయి కూడా" కళ్యాణి అంది.

"ఇక్కడి భాషలో కొంచెంయాస ఉంటుందని, మావైపు వాళ్ళకు అది సరిగా అర్థంకాదని అన్నాను. అందులో తప్పేముంది" ఇందిర విసురుగాఅంది.

"ఇందిరగారు, అందరం మాట్లాడేది తెలుగు భాషే కదా. కాకపోతే ఒక్కో ప్రాంతంలో ఒక్కో మాండలికంలో మాట్లాడతారు. రాయలసీమ వాళ్ళొక యాసతో మాట్లాడతారు. కోస్తా జిల్లాలో ఒకయాస, తెలంగాణ ప్రాంతంలో మరో యాసతో మాట్లాడతారు. అంతమాత్రాన ఒక ప్రాంతం భాషను చిన్నతనం చేసి మాట్లాడవలసిన అవసరంలేదు కదా. ఎవరి ప్రాంతీయ మాండలికాన్ని వాళ్ళుపయోగిస్తారు. కొంచెం తేడా ఉన్నంత మాత్రాన అది అర్థం కాదు అనుకోవడం పొరపాటు. మేం రాయలసీమ, కోస్తా జిల్లాల భాష అర్థం చేసుకోగలిగినట్లే మీరు కూడా తెలంగాణ భాషను అర్థం చేసుకోగలరు. అది నాకు తెలుసు. నిజం చెప్పండి, మీరిక్కడికి వచ్చిన ఈ పదిహేను సంవత్సరాలలో ఇక్కడి వాళ్ళెవరైనా మిమ్మల్ని, మీ భాషను చిన్నబుచ్చడంగాని, అవమానించడంగాని చేశారా. ఒకవేళ అలాచేసి ఉంటే మీరిక్కడ ఇల్లు కట్టుకొని సెటిల్ అయ్యే వాళ్ళు కాదు గదా. ఇక్కడి వాళ్ళ సహకారంతోనే మీరు ఇన్నిరోజులుగా హాయిగా ఉండగలుగుతున్నారు." ఇందిర మౌనంగా కూర్చుంది. ఆమె ముఖంలో అసహనం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

"మీరేకాదు, మన రాష్ట్రంలో కోస్తా ఆంధ్ర, రాయలసీమల నుండి మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకలాంటి వివిధ రాష్ట్రాల నుండి ఉద్యోగ రీత్యా, వ్యాపారం దృష్ట్యా ఎంతో మంది వొచ్చి తెలంగాణలో సెటిల్ అయినారు. వాళ్ళందరితోను కలిసిమెలిసి ఉండి, ఆదరిస్తున్న గొప్ప సంస్కారం ఇక్కడి ప్రజలది".

మళ్ళా కళ్యాణే "నార్త్ ఇండియాలో ఎక్కువమంది మాట్లాడేది హిందీ అయినా, ఆ హిందీ భాషను బీహార్‌లో ఒకరకంగా, ఉత్తరప్రదేశ్‌లో ఒకరకంగా, మధ్యప్రదేశ్‌లో మరోరకంగా ఎవరి యాసలో వాళ్ళు మాట్లాడతారు. అంతెందుకు. అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లీషును అమెరికాలో ఒకరకంగా, బ్రిటన్‌లో ఒకరకంగా, ఇండియాలో మరోరకంగా మాట్లాడుతారు. పదాలు పలకడంలో తేడా ఉండొచ్చు కానీ, భాష ఏమీ మారదుకదా. అసలు భాష అనేది ఒకరి అభిప్రాయాలు మరొకరు అర్థం చేసుకోవడానికి అనుసంధానం గాను, మన దినసరి కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించుకోవడానికి ఒక మార్గంగాను ఉపయోగపడుతుంది. యాసలో కొంత తేడా ఉన్నంత మాత్రాన మనందరం తెలుగువాళ్ళం కాకపోముగా. మనం అంతో ఇంతో చదువుకున్నవాళ్ళం. ఇతరులు పొరపాటుగా మాట్లాడితే సరిదిద్దవలసిన వాళ్ళం. భాష మాండలికంలో తేడానుబట్టి ఏదో ఒకటి గొప్ప అనుకోవడం సరికాదు. దేని గొప్పతనం దానిదే. తెలుగుభాషలో ఉండే తీయదనాన్ని ఎవరికి తోచిన మార్గంలో వాళ్ళు వ్యక్తపరిచే ప్రయత్నం చేస్తున్నారు. అందుకు సంతోషించాలిగాని, తేడాలను ఎత్తి చూపగూడదు" ఆవేశంగా అంది.

ఇంతలో ధీరజ్ అక్కడకు వచ్చి "అమ్మా! ఇక్కడున్నావా? పోదాం రా" అని పిలవడంతో "నేను వెళ్ళొస్తానండి. నా మాటలతో మిమ్మల్ని బాధపెడితే క్షమించండి, వీలయితే అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి కాని అపార్థం మాత్రం చేసుకోకండి" అంటూ కళ్యాణి బయలుదేరింది.

ఇందిర మనసులో "ఈమె మాటల్లో కూడా కొంత నిజం లేకపోలేదు. ఇప్పటి నుండి మాట్లాడేప్పుడు కాస్త ఆలోచించి మాట్లాడాలి" అనుకుంటూ లేచింది.





# రచయితలకు సూచనలు

* మీ రచనల్ని కాగితానికి ఒక వైపున మాత్రమే రాయాలి.
* జిరాక్స్ కాపీలు పరిశీలనకు స్వీకరించలేం.
* మీ రచనతోపాటు పూర్తి అడ్రసు రాయాలి. పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరిగా ఉండాలి.
* రచయిత కలం పేరుతో పాటు అసలు పేరు కూడా రాయాలి.
* అనువాద రచనలకి మూల రచయిత అనుమతి పత్రం జత చేయాలి.
* మీ రచన ఇదివరకు ఎప్పుడూ, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదన్న హామీపత్రం ఉండాలి.
* ప్రచురించని రచనల్ని తిరిగి పొందాలనుకుంటే తగిన స్టాంపులు అంటించిన సెల్ఫ్ అడ్రసుగల కవర్ తప్పనిసరిగా జతచేయాలి.
* రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్లపై ఎలాంటి సంప్రదింపులకు తావులేదు.
* ఇతివృత్తంలో నూతనత్వం, రచనా సంవిధానంలో వైవిధ్యం వున్న కథల్ని పంపించండి.
* హాస్య రచనలకు ప్రత్యేక ప్రాధాన్యం. వ్యంగ్యం, చమత్కారం కలగలసిన కథలను పంపించండి.

మా చిరునామా:
ఆదివారం వార్త,
ఎడిటర్, వార్త,
లోయర్ టాంక్ బండ్, హైదరాబాద్ - **500 080**